క్లుప్తంగా

వెంకన్న మృతికి సంతాపం



వెంకన్న మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అల్లుబెల్లి నర్సిరెడ్డి

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మైలారపు వెంకన్న ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం సూర్యాపేట పట్టణంలో ఆయన మృతదేహానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, డీఈఓ అశోక్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రాములు, జిల్లా అధ్యక్షుడు సోంబాబు, ఎంఈఓ నకిరేకంటి రవి, నల్లగొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సైదులు, వెంకటేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

తిరుమలగిరి : రైతుల సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో దళారీలు, వ్యాపారుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇంటిని ముట్టడిస్తున్న నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. వెంటనే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో దళారీలు, వ్యాపారులు కుమ్మక్కై రైతులను దోపిడీ చేస్తున్నారని విమర్శించారు.

సూర్యాపేట వాసి పిన్నం రవికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న రవి

సూర్యాపేటటౌన్ : సూర్యాపేటకు చెందిన సీనియర్ తెలుగు ఉపన్యాసకులు, ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ పిన్నం రవికి టీచింగ్, ట్రైనింగ్ విభాగంలో గౌరవ డాక్టరేట్ లభించింది. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆసియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ న్యూఢిల్లీ, గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్ అందుకున్నట్లు ఆయన చెప్పారు. గత 28 సంవత్సరాలుగా తెలుగు భాషా, సాహిత్య రంగాల్లో విశేష కృషి చేసినందుకుగాను డాక్టరేట్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

శివస్వాముల పూజలు



పూజల్లో పాల్గొన్న స్వాములు

ఆత్మకూర్(ఎస్) : శివరాత్రి సందర్భంగా గణపతి హోమం, రుద్ర హోమంలో భాగంగా మండల కేంద్రంలోని శివాలయంలో శివస్వాములు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములు నగిరే పర్వతాలు, తంగెళ్ల వీరారెడ్డి, తండు శీను, బొడ్డు మన్సూర్, ఉప్పల శ్రీశైలం, కోడూరు రామకృష్ణ, జలగం మల్లేష్, మొరిశెట్టి వెంకటేష్, నరేష్, శీను, సందీప్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



ప్రథమ బహుమతి సాధించిన జట్టు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవస్థాన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 4రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం ముగిసాయి. ఈ క్రీడలలో నూతనకల్ బీఎస్‌వై క్లబ్ ప్రథమ బహుమతి, మోత్కూరు క్రీడాకారులు ద్వితీయ బహుమతి, జాజిరెడ్డిగూడెం క్రీడాకారులు తృతీయ బహుమతి, వరంగల్ క్రీడాకారులు చతుర్థ బహుమతి, గొట్టిపర్తి క్రీడాకారులు ఐదవ బహుమతి సాధించారు. ఈ కార్యక్రమంలో పీడీ సోమయ్య, పీఈటీలు లింగాల రవి, ఎల్.సైదులు, నిర్వాహకులు పాల్గొన్నారు.



ద్వితీయ బహుమతి పొందిన జట్టు

నిర్వహణ లేక నిరుపయోగం

- గ్రామాల్లో నిరుపయోగంగా దర్శనమిస్తున్న నీటితొట్లు
- ఎండలు పెరుగుతున్నందున పశువులకు అందని తాగునీరు
- నీటితొట్లను వినియోగంలోకి తేవాలని రైతుల వేడుకోలు



మాచారంలో నిరుపయోగంగా మారిన పశువుల నీటితొట్టి

పెన్‌పహాడ్ : వేసవిలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద నీటి తొట్లు నిర్మించిన విషయం తెలిసిందే. గ్రామాల్లో నీటి సౌకర్యం కలిగిన ట్యాంకులు, ప్రజా కుళాయిల వద్ద వీటిని నిర్మించారు. కానీ సంబంధిత అధికారులు నీటి తొట్ల నిర్వహణను గాలికొదిలేయడంతో అవి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. చాలా గ్రామాల్లో నీటితొట్లు శిథిలావస్థకు చేరాయి. అంతేకాకుండా వాటి నిర్మాణాలు నాసిరకంగా చేపట్టడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో పశుపోషకులు మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో ఇలా..

పెన్‌పహాడ్ మండలంలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామానికి రెండు చొప్పున సుమారు 57 వరకు పశువుల నీటితొట్లు నిర్మించారు. మాచారం గ్రామంలో నీటి తొట్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కొన్ని గ్రామాల్లో నీటి సరఫరా లేక నీటి తొట్లు నిరుపయోగంగా మారాయి. వేసవి నేపథ్యంలో నీటి తొట్లను వినియోగంలోకి తీసుకువచ్చి పశువుల దాహార్తి తీర్చాలని ఆయా గ్రామాల రైతులు అధికారులను కోరుతున్నారు.

చెరువుల్లో నీరు తాగిస్తున్నాం

గ్రామంలో నిర్మించిన పశుశుల నీటి తొట్లు నిరుపయోగంగా మారాయి. దీంతో పశువులను గ్రామానికి దూరంగా ఉన్న చెరువు వద్దకు తీసుకెళ్లిని నీటిని తాగిస్తున్నాం. ఎండలు తీవ్రమైతే నీటి కోసం ఇబ్బంది పడాల్సి వస్తోంది. నీటి తొట్టిలను వినియోగంలోకి తేవాలి.

– మల్లయ్య, పశువుల కాపరి, మాచారం

వినియోగంలోకి తీసుకురావాలి



పెన్‌పహాడ్ మండలంలోని అన్ని గ్రామాల్లో పశువుల నీటి తొట్టిలు నిర్మించాం. అయితే వాటి నిర్వహణను గ్రామ పంచాయతీలకు అప్పగించాం. నీటితొట్టిలకు మరమ్మతులు చేపట్టి నీటిని సరఫరా చేసే బాధ్యత ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు తీసుకుంటారు.

– రవి, ఏపీఓ

రైతులకు రుణమాఫీ చేయాలి

ఆత్మకూర్ (ఎస్) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దండా వెంకట్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో జరిగిన సీపీఎం గ్రామ శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రుణమాఫీ కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీ ప్రకారం రెండు లక్షల లోపు రుణాలు అన్నింటిని మాఫీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు డబ్బులు కేవలం మూడు ఎకరాలకు మాత్రమే ఇచ్చిందని, మిగిలిన రైతులకు కూడా విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి అవిరే అప్పయ్య, మండల కమిటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, తండ చంద్రయ్య, పార్టీ సభ్యులు మాణిక్యం, దేవరకొండ భిక్షం, మురపాక సైదులు, ఎరగాని సైదులు, కానుగు దుర్గయ్య, ఐలయ్య, మామిడి లింగయ్య, పిడమర్తి నరసయ్య, కవిత పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం రోజున ముగ్గుల పోటీలు

నూతనకల్ : ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని గునగంటి సత్యనారాయణగౌడ్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ముగ్గుల పోటీలను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ నాయకుడు పెద్దింటి రంగారెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మొదటి బహుమతి రూ. 3వేలు, ద్వితీయ బహుమతి రూ. 2వేలు, తృతీయ బహుమతి రూ. 1500తో పాటు కన్సోలేషన్ బహుమతులు ఉంటాయని తెలిపారు. ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరూ ముగ్గుల పోటీల్లో పాల్గొనాలని కోరారు.

నడిగూడెం అభివృద్ధికి నిధులు

నడిగూడెం : నడిగూడెం మండల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే నాలుగు కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకట్ రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ప్రభుత్వ పాఠశాలల్లో వంట గదులు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వానివి ప్రజావ్యతిరేక విధానాలు



తొండ గ్రామంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు

తిరుమలగిరి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. మంగళవారం తొండ గ్రామంలో నిర్వహించిన సీపీఎం మండల స్థాయి విస్తృత సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో రైతు వ్యతిరేకి అయిన బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. నరేంద్రమోదీ ప్రభుత్వం పేదలకు చేసిందేమి లేదని, కార్పొరేటర్లకే మేలు చేసిందని ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగం, నిత్యావసరాల ధరలు పెరిగాయని విమర్శించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్న రైతులను ఢిల్లీలో అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బందెల అబ్రహం, ఉప్పలయ్య, లింగయ్య, సత్యనారాయణరెడ్డి, సోమయ్య, యాకయ్య, వెంకటయ్య, వెంకన్న, రాజ్‌కుమార్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

10న సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి



తుంగతుర్తిలో సేవాలాల్ ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

తుంగతుర్తి : ఈ నెల 10న మండల కేంద్రంలో నిర్వహించే సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆరాధ్య ఫౌండేషన్ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జయపాల్ నాయక్ కోరారు. మంగళవారం తుంగతుర్తి మండల కేంద్రంలో సంత్‌సేవాలాల్ జయంతి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. అడవి బిడ్డల ప్రత్యేకమైన ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక దృక్పథం, సామాజిక సాంస్కృతిక జీవన విధానాన్ని కాపాడడం కోసం సేవాలాల్ చేసిన కృషి మరువలేనిదన్నారు. తన ప్రజలను బయట ప్రపంచం నుంచి అనుక్షణం రక్షించుకునే దిశగా సంతు సేవాలాల్ మహరాజ్ జీవితాంతం పోరాటం సాగించారని తెలిపారు. ఈ నెల 10న తుంగతుర్తిలో జరిగే జయంతి కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరాధ్య ఫౌండేషన్ మండల అధ్యక్షుడు అంబటి రాములు, ఆరాధ్య ఫౌండేషన్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు నాగు నాయక్, జిల్లా అధ్యక్షుడు వెంకన్న నాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు సోమ్లా నాయక్, నాయకులు ధారాసింగ్, వెంకన్న, కిషన్ నాయక్, శ్రీకాంత్, కిట్టు నాయక్, హేమనాయక్, ధారాసింగ్, లింగనాయక్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లులు



నాగారం : మాచిరెడ్డిపల్లిలో వినియోగదారులకు జీరో విద్యుత్ బిల్లు అందజేస్తున్న నాయకులు



నూతనకల్‌లో లబ్ధిదారులకు జీరో బిల్లులు అందజేస్తున్న అధికారులు, నాయకులు

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకంలో భాగంగా మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో వినియోగదారులకు మంగళవారం విద్యుత్‌శాఖ సిబ్బంది జీరో బిల్లులను అందజేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు పసుపులేటి వెంకట్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తుందన్నారు. గృహజ్యోతి పథకానికి అర్హులైన వారు తమ రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తు నంబర్‌తో మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్‌లైన్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ లైన్‌మెన్ శ్రీను, కాంగ్రెస్ నాయకులు శీల లింగమల్లు, వడ్డే యాదగిరి, రవీందర్, నాతి శీను, సోమిరెడ్డి, మధు పాల్గొన్నారు.

నూతనకల్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు అందుతాయని మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గృహజ్యోతి పథకం ద్వారా అర్హులైన విద్యుత్ లబ్ధిదారులకు జీరో బిల్లులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు మహేశ్వరం చంద్రకళవెంకటయ్య, కళ్లెం కృష్ణారెడ్డి, బొడ్డుపల్లి అంజయ్య, దేవిరెడ్డి నర్సిరెడ్డి, బండపల్లి సాగర్, జటంగి గణేష్, సాబాది వాసు, జాకీర్‌హుస్సేన్, నెల్లుట్ల మహేష్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బహుజన మహాసభ కరపత్రాల ఆవిష్కరణ



కొత్తగూడెంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యాదవ సంఘం నాయకులు

తుంగతుర్తి : సూర్యాపేటలో ఈ నెల 10న జరిగే బహుజన రాష్ట్ర మొదటి మహాసభను విజయవంతం చేయాలని యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ మెంతబోయిన సింహాద్రి యాదవ్ కోరారు. మంగళవారం కొత్తగూడెం గ్రామంలో మారోజు వీరన్న స్థూపం వద్ద బహుజన మహాసభ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. బహుజనులను ఐక్యం చేసి రాజ్యాధికారాన్ని సాధించే లక్ష్యంతో మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలకు పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకులతో పాటు మంత్రి సీతక్క హాజరు కానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన మహాసభ రాష్ట్ర నాయకులు నారబోయిన వెంకట్‌యాదవ్, బుడిగె మల్లేష్ యాదవ్, బత్తుల వెంకన్న, మాంద్ర మల్లయ్యయాదవ్, పగలగాని సాగర్, వడలగాని సుదర్శన్, వర్ధెల్లి రాము, తొట్ల శంకర్, ఓర్సు ఎల్లయ్య, ఉప్పుల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే లక్ష్యం

చిలుకూరు : గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద మహిళల అభివృద్ధే లక్ష్యమని జిల్లా ప్రోగ్రాం మేనేజర్‌లు (డీపీఎంలు) లక్ష్మీనారాయణ, ఆంజనేయులు అన్నారు. మంగళవారం చిలుకూరులోని మండల సమాఖ్య కార్యాలయంలో చిలుకూరు, హుజూర్‌నగర్ మండల వీఓఏలకు లక్‌పతి దీదీపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. మహిళలకు మహిళా సంఘాల ద్వారా లోన్లు ఇస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో లఖ్‌పతి దీదీ ట్రైనర్ గుండాల సైదయ్య, ఏపీఎం రెమిడాల దుర్గాప్రసాద్, సీసీ స్వరూప, మల్లేష్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రహదారి.. రాకపోకలకు పాట్లు



అర్వపల్లి-కొమ్మాల మధ్య మూలమలుపు వద్ద రోడ్డుపైకి పెరిగిన చెట్లు



కాసర్లపహాడ్ సమీపంలో..



అర్వపల్లి-కొమ్మాల మధ్య దెబ్బతిన్న బీటీరోడ్డు

అర్వపల్లి : అసలే మూలమలుపులు.. ఆపై రోడ్డుకు ఇరువైపులా అల్లుకుపోయిన కంపచెట్లు. దీంతో ఆ రహదారిపై రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. మూడు మండలాల ప్రజలు రాకపోకలు సాగించే అర్వపల్లి–కొమ్మాల రహదారి మొత్తం 9 కిలోమీటర్లకు గాను పూర్తిగా దెబ్బతింది. దీనికితోడు ఈ రహదారికి ఇరువైపులా పలుచోట్ల కంపచెట్లు అల్లుకపోయాయి. దీంతో నిత్యం ఈరహదారిపై ప్రయాణించే ఆయా గ్రామాల ప్రజలు, వాహన చోదకులు అవస్థల పాలవుతున్నారు. కంపచెట్లు దట్టంగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక క్షణాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే ఈ రహదారిపై మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. బీటీరోడ్డు దెబ్బతిని గుంతలమయంగా మారింది. ఫలితంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు బీటీ రెన్యూవల్ చేసి, కంపచెట్లను తొలగించి, మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

సూర్యాపేటటౌన్ : ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికలలోపు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్‌కుమార్ మంగళవారం ప్రకటనలో కోరారు. పాత పెన్షన్ పునరుద్ధరించాలని మార్చి 4న సంఘం ఆధ్వర్యంలో సీపీఎస్ ఉద్యోగులు పీఆర్‌సీ కమిషన్‌కు మెయిల్స్ పంపినట్లు తెలిపారు. అంతేకాకుండా పీఆర్‌సీ కమిషన్‌ను కలిసినట్లు పేర్కొన్నారు.

విశ్వకర్మ యోజనకు అపూర్వ స్పందన

తిరుమలగిరి : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రకటించిన విశ్వకర్మ యోజనకు తుంగతుర్తి నియోజకవర్గంలో అపూర్వ స్పందన లభించిందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, నియోజకవర్గ కోఆర్డినేటర్ దీన్‌దయాళ్ తెలిపారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశ్వకర్మ యోజన గురించి నియోజకవర్గంలో ప్రజలను చైతన్య పరిచి 2400 మందిని పథకంలో చేర్పించినట్లు తెలిపారు. అన్ని మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిరుమలగిరి : మున్సిపాలిటీ పరిధి అనంతారంలోని బిక్కేరు వాగు నుంచి రెండు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా మంగళవారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ నికోలస్ మాట్లాడారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

అర్వపల్లిలో వైభవంగా దేవరాజ సేవ



దేవరాజ సేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి దేవరాజ సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరాజ వాహనంపై నర్సింహస్వామి, అమ్మవార్లు శ్రీదేవి, భూదేవిలు కొలువుదీరారు. దేవరాజ సేవ ఉత్సవం సందర్భంగా తొలుత ఆలయంలో పూజలు జరిపి స్వామి అమ్మవార్లను మాడ వీధులలో ప్రదక్షిణలు జరిపారు. అనంతరం దేవరాజ వాహనంలో పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు ఇంటింటికీ హారతులిచ్చి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవానికి హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, ధర్మకర్తలు జేరుపోతుల సోమయ్య, దిర్శనపు కృష్ణమూర్తి, కనుకు రేణుక, లక్ష్మాజీ, ఈఓ వై.శ్రీనివాసరెడ్డి, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, స్వామి సేవకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

'పల్స్ పోలియో' విజయవంతం



పోలియో చుక్కలు వేస్తున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : 5 ఏళ్లలోపు చిన్నారులు పోలియో బారిన పడకుండా చేపట్టిన పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం మండలంలో విజయవంతమైంది. తొలి రోజుకేంద్రాల్లో, సోమ, మంగళ రెండు రోజులు ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేశారు. జాజిరెడ్డిగూడెం మండలంలో ఐదేళ్ల లోపు చిన్నారులు 2,064 మంది ఉండగా వంద శాతం చుక్కలు వేసే కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ చిలుకూరి మణిదీప్, సీహెచ్‌ఓ చరణ్ తెలిపారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

- ఎస్సారెస్పీ నీళ్లు రాక చెరువులు, కుంటల్లో తగ్గుతున్న నీటి మట్టం
- ఎండిపోతున్న పంట పొలాలు
- అయోమయంలో అన్నదాతలు



గట్టికల్‌లో నీరు లేక బీటలు వారుతున్న వరిపైరు


ఆత్మకూర్ (ఎస్) : నాన్ ఆయకట్టు మండలమైన ఆత్మకూరు మండలంలో చెరువులు, కుంటల్లో నీరు తగ్గిపోయి భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీంతో బోర్లలో కూడా నీరు తగ్గుతోంది. ఎస్సారెస్పీ నీటిని నమ్ముకుని సాగుచేసిన వరి పంటలకు ఈ సీజన్‌లో సరిపడా నీళ్లు రాకపోవడంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎండలు మండిపోతుండటం ఉన్న బోర్లు కూడా సరిగా పోయడం లేదు. ఈ క్రమంలో కొంతమంది రైతులు కొత్త బోర్లు వేయడానికి మొగ్గుచూపుతున్నారు. పంటలను కాపాడుకోవడానికి అప్పులు తెచ్చి మరి బోర్లు వేయిస్తున్నారు. చివరకు బోర్లు కూడా పడకపోవడంతో అప్పుల పాలవుతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎస్సారెస్పీ నీళ్లు వస్తే చెరువులు, కుంటల్లో నీరు ఉండి సాగునీటి సమస్య తలెత్తేది కాదని రైతులు అంటున్నారు. సాధారణంగా ఆత్మకూరులో రైతులు వరితో పాటు పత్తి, పెసర పంటలను సాగు చేస్తారు. కానీ నాలుగైదు సంవత్సరాల నుంచి ఎస్సారెస్పీ నీళ్లు సమృద్ధిగా రెండు పంటలకు సరిపోను రావడంతో పత్తి, ఇతర పంటలను సాగు చేయకుండా వరినే సాగు చేస్తున్నారు. అయితే ఈ వేసవిలో సరిగా ఎస్సారెస్పీ నీళ్లు రాకపోవడం, చెరువులు, కుంటల్లోనూ నీళ్లు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. ఈ పరిస్థితుల్లో రైతులు వేసవిలో పంటలు చేతికి వస్తాయా..? లేదా ..? అన్న ఆందోళనలో ఉన్నారు.

పొలాలు పారడం లేదు

నాలుగేళ్లుగా ఎస్సారెస్పీ కాలువను నమ్ముకుని రెండు పంటలను సాగు చేస్తున్నా. ఈ వేసవిలో సరిగా ఎస్సారెస్పీ జలాలు అందడం లేదు. దీంతో పంటలను కాపాడుకునేందుకు రెండు బోర్లు వేశాను. అయినా పడకపోవడంతో రూ.50వేల అప్పు అయింది. ఇప్పటికీ పొలాలకు సరిగా నీరు అందడం లేదు.

– కడపర్తి శ్రీను, ఆత్మకూర్ (ఎస్)

బోరుబావుల్లో నీరు తగ్గింది



గతంలో వర్షాలు, ఎస్సారెస్పీ నీళ్ల రాకతో చెరువులు, కుంటల్లో నీరు ఉండి బోరుబావులు సమృద్ధిగా పోశాయి. ఈ వేసవిలో సరిగా నీళ్లు రాకపోవడంతో బోరు బావుల్లో నీళ్లు తగ్గాయి. ఈ బోరుబావులను నమ్ముకుని మూడెకరాల వరకు సాగుచేశా. కానీ పంటకు సరిపోను నీరు పారే పరిస్థితి లేదు.

– మల్లారెడ్డి, రామన్నగూడెం

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న దాతలు

నూతనకల్ : దాతలు అందిస్తున్న సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం ధరావత్ శివయ్య అన్నారు. కొత్త తండాకు చెందిన బాణోతు శ్రీను నాయక్ మంగళవారం పెద నెమిల జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకయ్యగౌడ్, ఉమారాణి, కవిత, పద్మావతి, మంజుల, శ్రీదేవి పాల్గొన్నారు.

ఎంపీపీ ప్రత్యేక పూజలు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని మంగళవారం ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్ రెడ్డి ఎంపీపీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్త కనుకు రేణుక, బైరబోయిన నాగయ్య, భక్తులు పాల్గొన్నారు.